# భిన్నత్వంలో ఏకత్వం : :

రచన :
కె. శ్రీరామమూర్తి

నిశ్శబ్దంగా, నిర్జీవంగా వున్న ప్రకృతిలోకి - నిర్నిమేషదృష్టులను సారిస్తోంది...

వరనుంచి తీసిన బాకువలె, హఠాత్తుగా మెఱసిన మెఱుపువలె వచ్చాడు - ఆమెను శాసించాలని, ఆమెకు శాస్తిచెయ్యాలని ఆగ్రహంతో......! అంతులేని అతన్ని ఆగ్రహాన్ని —అవధిలేని అతని ఉక్రోషాన్ని చూశి నవ్విందామె!...నవ్వుతో సుడిగుండంలా సుడులు తిరిగిపోయిందామె...!!—ఆమె వెన్నెలకురిసే నవ్వులు అతని పాలిటి చీకట్లులా కనుపించి - ఒల్లు మండించి, రక్తం ఉడుకెత్తించి, వెఱ్ఱివాణ్ణి చేశాయ్!...

ఏడ్వలేక నవ్వుతున్నావ్...? - ప్రభంజనం లాహోరెత్తాడు. కోటానుకోట్ల గులాబీలు విచ్చుకొన్నట్లు నవ్విందామె! -...వచ్చావా, మఱేదీ!...మీ అన్నకు నేనిచ్చిన విడాకుల కుల విషయమై నన్ను సంజాయిషీ అడగడానికి ఆగ్రహంతో వచ్చావా...? ఇది రెండవసారి కదూ నీవు నన్ను కలుసుకోవడం... మొదటి సారి నవ్వుతో - రెండవసారి కోపంతో... వెనుకటిలా లేవేం మఱేదీ?—చిక్కి శల్యమయ్యావేం?—

కట్టిబెట్టు నీకల్లబొల్లి మాటలు...నాదగ్గరనా నీ ఆటలు?—సాగవుసుమా నీ నటనలు.

మఱేదీ! ... ఆడదాన్ని శాసించడానికి, సాధించడానికి ఎవరిచ్చారోయ్ మీకీ అధికారం? దురంహాకారంతో, దుర్నీతితో మమ్ము మీ చెప్పు చేతల్లో పెట్టచూస్తారేం?...తెల్లవారిచ్చిన స్వాతంత్ర్యం మీకేనా, మాకులేదా? —సౌభాగ్యం, సౌమార్గ్యం మాకుకరువా...? —స్త్రీ అంటే అంత అలుసేం?, అంత చులకనేం??...మీ కోర్కెల గోడలకు మేమంతా వెల్లవెయ్యాలా!...మీ చేతుల్లో కీలుబొమ్మలము, ఆటబొమ్మలము, విలాసవస్తువులమూనా మేము?—బాబూ, ఎన్నాళ్ళీ నరకం! ఇక లేదా సుఖం?—

ఆపు నీ ఉపన్యాసం! చాలు నీ కపట విశ్వాసం!

బఱితెగించిన స్త్రీవి నీవు!—విషం కక్కే పామువి నీవు!—మాటల్లో చేతల్లో మత్తుమందుచల్లి - మారణహోమం చేసేరాక్షసవి కాదునీవూ?—జూదంలో సర్వం కోల్పోయినవాడిలా - అన్నయ్యకు సర్వభ్రష్టత్వం చేసిన టక్కులాడివి కావూనీవూ! సముద్రంలోకి నిష్క్రమించిన తరంగంలా - ఆమె మధుర మందహాసం అంతర్థానమై దానివిషాదంలాస్యం చేసింది. యథార్థం తెలియని నీకు - నేనలాగే కనుపిస్తాను వాతలుపడ్డ నాశరీరం చూడు— వాపులెక్కిన నా కళ్ళు చూడు. ఎవరికి తెలుస్తుంది నా అంతరంగంలోని వ్యధ? నామూగ బాధ? జీవితం నందనవనం, ఆనందనిలయం అనుకొన్న.

నాకుజీవితంలో హాలాహలం ప్రవహించింది. అందంగాలేని మీ అన్నయ్యకు-సౌందర్యంతో వున్న నాపై ఈర్ష్య. అంతులేని, అర్థంలేనికసి. నా శరీరంలో అణువణువూ మీ అన్నగారి తృష్ణకు, నలిగిపోయింది. నాఅందం త్రాగె య్యాలనుకొనేవారు. వారి కోర్కెలు తీర్చే కామధేనువులా వినియోగించారు!— వారికి అడ్డుచెప్పడానికి నా కధికారం లేదు. నోరెత్త డానికి హక్కులేదు—నా హక్కులన్నీ వారి వారి హస్తగతమేనట! నేను కూర్చుంటే అను మానం, నిల్చుంటే అనుమానం! నేనొక కూపస్తమండూకాన్ని; బైట ప్రపంచం నాకు లేదు; నేను చూడరాదు! ఇది వారి అడ్డులేని శాసనం! ఏమాత్రం అనుమానం కలిగినా వారి దండనకు గురికావల్సిందే?— నరకమంటూ మఱి వేరేలేదు; నాపాలిట ఇల్లే నరకం!— నా సర్వహక్కులూ భుజించారాయన. ఆవేశం తో ఆగిందామె — కన్నీరు మున్నీరైంది. కారుణ్యం ఆమె వదనంలో ప్రవహించింది.

నోట మాట రాక శిలా ప్రతిమలా కూర్చు న్నాడతను.

పదిహేను సంవత్సరాలు అనుభవించాను- రౌరవనరకం!—ప్రతిరోజూ అనిపించేది. నే నెందు కనుభవించాలి, ఇంత దుఃఖదాసీదానిలా నేనెందుకు పడి ఉండాలి? . . . ఆయన ఎదుట అడగడానికి సాహసించలేక పోయేదాన్ని . . వారు తెచ్చి చదివే పత్రికలు, పుస్తకాలు - రహస్యంగా చదివేదాన్ని . . . అవన్నీ స్త్రీ స్వాతంత్ర్యాన్నే ఘోషించేవి. వాటిని చది వాక అనిపించింది. . . స్త్రీ వంట యింటి కుం దేలు కాదని, స్త్రీ - మొగవానికి బానిస కాదని.

నాలో ఈ విధంగా ప్రతీకార వాంఛజనిస్తూ ఉండగా, దాన్ని మా ప్రక్కింటి అమ్మాయి ఉషద్దోహదం చేసింది, కాలేజిలో చదువుతూ అభ్యుదయ భావాలుగల ఉష - స్త్రీ స్వాతం త్ర్యం గూర్చి నా కెన్నెన్నో విషయాలు బోధ పరిచింది. ప్రతి రోజూ నాతోపాటు అంతో ఇంతో ఆమెకూడా వ్యధ చెందేది. చివరికి - ఆమె నాలో నెలకొల్పిన ధైర్యంతోనే - ఆమె నాకిచ్చిన ప్రోత్సాహంతోనే, నేను కొన్ని కొత్త శక్తులను పుంజుకొని ఒక శుభ ముహూ ర్తాన - మీ అన్నగారివద్ద నా సర్వ స్వాతం త్ర్యం ప్రకటించాను . . . దాంతో ఆయన కోపంతో తారాపథాన్నందుకొన్నారు. చెయి చేసుకోపోయారు. నాలోని నవీన శక్తుల ప్రోద్బలంతో తిరగబడ్డాను . . . ఆయన అగ్ని హోత్రుడై నా మెడ పట్టుకొని బైటికి గెంటే శారు. దరిమిలాను నేనేం చేశానో నీకు తెలుసు. నాకు స్వాతంత్ర్యం కావాలి; అది మీ అన్న గారికి ఇష్టం లేదు. జీవితమంతా ఆయనాగారికి దాస్యం చెయ్యడమే కాదు నా జీవిత పరమా ర్థం . , . నన్ను శరణాలయం వారు ఆదరించి - కార్యదర్శిని పదవిచ్చారు. జీవితం సుఖపద

నంగా ఊహించుకొన్న నాకు - జీవితమొక మసి పూసినవదనంగా, అఖండభయసదనంగా అయి కూర్చుంది. తనకు సరిపడని స్త్రీకి విడాకులివ్వడానికి పురుషునికి ఎంత హక్కుందో - తనకు సరిపడని పురుషునికి విడాకులివ్వడానికి స్త్రీకి కూడా అంతే అధికారముంది. పురుషుడు విడాకులిస్తే విరుచుకుపడుతోంది. హు!- పురుషునిలో వైషమ్యం, కౌటిల్యం, స్వార్థం తప్ప మరేం నాకు కనుపించలేరు.

ఆమె నిట్టూర్చింది . . . గులాబీలు, సంపెంగలు, మందారాలు, సన్నజాజులు, దవనం మున్నగునవన్నీ మంచలో పడవేస్తే ఎటువంటి పరిమళం వెలువడుతుందో, అటువంటి సుగంధం ఆమె నిశ్వాసంలోనుంచి వెలువడి అతణ్ణి ముంచెత్తి, వివశుణ్ణి చేసింది.

అతను చాలా కలవరపడుతున్నాడు.

ఆమె తలపులతాపులను భరించలేక కొద్ది క్షణాలు కళ్ళు మూసి గత జీవితాన్ని సింహావలోకనం చేసింది . . . కళ్ళు తెరిచి చూసేసరికి మఱేది గదినో లేడు.. ఆమె పాదాలముందు పెద్దనోట్ల కట్ట మాత్రం ఒహటుంది . . .! దాన్ని చూసి ఆమె చిత్రావిచిత్రంగా నవ్వింది . . . నవ్వుతో సుడిగుండంలా సుడులు తిరిగి పోయిందామె. . .!

